క్లుప్తంగా

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం


విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమౌతున్న తాటాకిల్లు

ద్వారకాతిరుమల : వేంపాడు గ్రామంలోని చవలవారిగూడెం పేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం ఉదయం ఒక తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన జోసుబోయిన వెంకటేశ్వరరావు, అతని భార్య కూలి పనులకు వెళ్లిన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి వారి తాటాకిల్లు దగ్ధమైంది. ఈ అగ్ని ప్రమాదంలో 4 కాసుల బంగారం, రూ. 50 వేలు నగదు దగ్ధమైనట్టు బాధితులు చెప్పారు. సుమారు రూ.2.50 లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్టు చెప్పారు.

నిర్మలగిరికి పాదయాత్ర


నిర్మలగిరికి పాదయాత్ర చేస్తున్న క్రీస్తు విశ్వాసులు

కొయ్యలగూడెం : ప్రముఖ క్రైస్తవ పుణ్యక్షేత్రం నిర్మలగిరికి క్రైస్తవ విశ్వాసులు ఆదివారం పాదయాత్రగా వెళ్లారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం చీపురుగూడెం గ్రామం నుంచి కొయ్యలగూడెం మీదుగా గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రానికి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. నడుచుకుంటూ వెళుతున్న యువకులకు ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు కండెల్లి శివ ఆహ్వానం పలికారు. ప్రతి గ్రామం నుంచి ఐదుగురు చొప్పున గ్రామాలలో క్రీస్తు విశ్వాసులను కలుపుకొని మేరీ మాత నిర్మలగిరికి చేరుకునే సమయానికి 50 మందికి పైగా క్రీస్తు మాలాధారణ వ్యక్తులతో హాజరుకానున్నట్లు ఆడమిల్లి చిరంజీవి, రవి, మోషే తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేత పరామర్శ


టీవీఎస్ రాజును పరామర్శిస్తున్న చినబాబు

కామవరపుకోట : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన మండల సీపీఐ నాయకులు టీవీఎస్ రాజును ఆదివారం స్థానిక కొత్తూరులోని ఆయన నివాసానికి వెళ్లి జీలకర్రగూడెం సొసైటీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవరాజు రామకృష్ణ రాజు (చిన్నబాబు) పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో నిత్యం ప్రజా సమస్యలపై కార్యక్రమాలు చేపట్టే మీకు ఇలా జరగడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధం హర్షణీయం

నిడమర్రు: రాష్ట్రంలో ప్లాస్టిక్ కవర్లు నిషేధిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని మానవత సేవా సంస్థ రీజనల్ చైర్మన్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఆదివారం మండల మానవత సంస్థ సమీక్ష సమావేశం మందలపర్రులోని సరిపల్లి కుమారి నివాసం వద్ద జరిగింది. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ఎవరికి వారే స్పందించి ప్లాస్టిక్ కవర్లు వాడకం మానుకోవాలని కోరారు. ఈ విషయంలో మానవత సంస్థ నుంచి పూర్తి మద్దతు, సహకారం ఉంటుందన్నారు. అనంతరం సంస్థ ప్రగతి, సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముదునూరి త్రివేణి, మండల కార్యదర్శి నౌడు అచ్యుత రామారావు, దెందుకూరి త్రిమూర్తిరాజు, ఇంటి చంటి, ఎంసీహెచ్ అప్పారావు, ఇందుకూరి సూర్యనారాయణరాజు, బత్రాజు ప్రసాద్, ఎస్, దావీదు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో చక్కటి జ్ఞానం


పెదవేగి గ్రంథాలయంలో చదవడం మాకిష్టంలో పాల్గొన్న చిన్నారులు

పెదవేగి : ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చదవడం మాకిష్టం కార్యక్రమం ఎంతో ఉపయోగకరమైందని పెదవేగి గ్రంథ పాలకుడు తోట అరుణ్‌కుమార్ చెప్పారు. ఆదివారం పెదవేగిశాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ చిన్ననాటి నుంచే పుస్తక పఠనంతో చక్కటి జ్ఞానం ఏర్పడుతుందని చెప్పారు. ఇలా సంపాదించుకున్న జ్ఞానంతో ఎదిగే కొద్దీ ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఆస్కారం ఉంటుందని ఆయన తెలిపారు.

తల్లీ జగదాంబ.. కరుణించమ్మా

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లిలో కొలువై ఉన్న జగదాంబ అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.56 నిమిషాలకు కలశ స్థాపనతో ప్రారంభమైన అమ్మవారి 66వ జాతర మహోత్సవాలు మార్చి 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆంధ్రా – తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో జరిగే ఈ ఉత్సవాల్లో ఇరు రాష్ట్రాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. సత్యం గల తల్లిగా పేరుండటంతో అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయంతోపాటు గుడి సమీపంలో ఉన్న అశ్వారావుపేట – జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారికి ఇరువైపులా విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశారు. జగదాంబ అమ్మవారిని జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కోర్సా పోచమ్మ, సొసైటీ అధ్యక్షులు బోదా శ్రీనివాసరెడ్డి, సీఐ బి. వెంకటేశ్వరరావు, ఎస్సై వి.చంద్రశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ చాత్రాతి భవాని శేఖర్, వైస్ చైర్మన్ చిట్టిబొమ్మ సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చందా ప్రసాద్, తదితరులు ఆదివారం దర్శించుకున్నారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు చేసినట్లు సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.


జగదాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న సీఐ వెంకటేశ్వరరావు


అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసిన ఎంపీపీ, జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీవారి సేవలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం ఉదయం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. అలాగే స్వామివారి మొమెంటోను, ప్రసాదాలను అందజేశారు. కోలగట్ల వెంట పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు ఉన్నారు.


కోలగట్లకు స్వామివారి మొమెంటోను అందజేస్తున్న ఆలయ అర్చకులు

మంగమ్మ తల్లి సన్నిధిలో..

బుట్టాయగూడెం : మండలంలోని కామవరం అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మగుడికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, మినీ బస్‌లు, లారీల్లో, భక్తులు ఉభయ గోదావరి జిల్లాలతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంగమ్మ తల్లిని జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి రొక్కం వరలక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామలాదేవి, న్యాయవాదులు ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ గుబ్బల మంగమ్మతల్లి చిత్ర పటాలను బహూకరించారు. న్యాయవాదులు మేకా ఈశ్వరయ్య, అచ్యుత శ్రీనివాసరావు, ఉద్దండం ఏసుబాబు, మేకల రామ్మోహన్‌రావు, మాదేపల్లి క్రాంతికుమార్, మహిళా న్యాయవాదులు ఎం. భువనేశ్వరి, డి.సాయికుమారి, తదితరులు మంగమ్మ తల్లిని దర్శించుకున్నారు.


మంగమ్మతల్లిని దర్శించుకున్న జూనియర్ సివిల్ జడ్జి, న్యాయవాదులు

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని డిమాండ్

టి.నరసాపురం : ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని టి.నరసాపురం పంచాయతీలోని ఆరు గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ఆదివారం కృష్ణాపురం, రుద్రకోటరాజుగూడెం, పుత్రేపు, ప్రకాశ్‌నగర్, కాపుగూడెం, రాజులగూడెం గ్రామాల ప్రజలు కృష్ణాపురం 3 రోడ్లకూడలి వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. వంటావార్పు చేసి, మానవహారం నిర్మించి ప్రత్యేక పంచాయతీని ఏర్పాటు చేయాలని నినదించారు. తమ గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని, కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు వల్ల అభివృద్ధికి మార్గాలు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో అర్జాసాగర్, భూక్యా వేణు, కుంజా రవికిరణ్, తాడేపల్లి చందు, గుండె మహారాజు, బాణాల నాగేంద్ర, పండు వీరభద్రుడు, భూక్యా రవి, భూక్యా శ్రీనివాస్, పోతునూరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.


వంటావార్పు, మానవహారం నిర్వహిస్తున్న ఆరు గ్రామాల ప్రజలు

ఎంపీ, ఎమ్మెల్యే నిధులతోనే తాగునీటి సమస్య పరిష్కారం

కుక్కునూరు : ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో వింజరం పంచాయతీ, బర్లమడుగు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ గ్రామంలో విద్యుత్ సమస్య కారణంగా మంచినీరు అందించలేని పరిస్థితి ఉండేదన్నారు. స్థానిక జెడ్పీటీసీ, వింజరం సర్పంచ్, వైస్ ఎంపీపీలు ఈ విషయాన్ని ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయించి మంచినీటి సమస్యను పరిష్కరించారని పేర్కొన్నారు. అయితే జీలుగుమిల్లి మండలానికి చెందిన ఓ మహిళా నాయకురాలు తానే ఈ సమస్యను పరిష్కరించినట్లు ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం చేసుకుంటున్నారని, అది వాస్తవం కాదన్నారు. ఈ విధంగా ప్రచారం చేసుకోవడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యే నిధులతోనే ఈ సమస్య పరిష్కారమైందని నరసింహరాజు పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరావు, వింజరం సర్పంచ్ జగిడి బాలరాజు, వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతాం

జంగారెడ్డిగూడెం : భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకులుగా జంగారెడ్డిగూడెంకు చెందిన కేవీ రమణ, ఎస్.రామ్మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫిబ్రవరి 25, 26 తేదీలలో శ్రీకాకుళంలో తొమ్మిదవ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. ఈ సభల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన ఎస్.రామ్మోహన్‌ను ఐఎఫ్‌టీయు రాష్ట్ర నాయకుడిగా, కేవీ రమణను రాష్ట్ర కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఇఫ్టూ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పలు ప్రజాసంఘాల నాయకులు శ్రేయోభిలాషులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తాము పోరాడతామన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత కల్పించాలని, హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.


ఇఫ్టూ రాష్ట్ర నాయకులుగా ఎన్నికైన జంగారెడ్డిగూడెంకు చెందిన కేవీ రమణ, రామ్మోహన్

సత్ప్రవర్తనతో మెలగాలి

జంగారెడ్డిగూడెం : ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీ, కేడీ, సస్పెక్ట్ షీట్ ఉన్న వారిని జంగారెడ్డిగూడెం సీఐ బాల సురేష్‌బాబు హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో రౌడీ, కేడీ, సస్పెక్ట్ షీట్ ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి అసాంఘిక, అవాంఛనీయ ఘటనలకు పాల్పడరాదన్నారు. ముఖ్యంగా వివాదాలకు గాని, మద్యం సేవించి గొడవలు చేయడం గాని చేయవద్దని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలిగి పోలీసువారికి సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే ఘటనలకు పాల్పడినా, పాల్గొన్న కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ఎం.సాగర్‌బాబు, సర్కిల్ క్రైమ్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రౌడీ, కేడీ, సస్పెక్ట్ షీట్ ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ బాలసురేష్‌బాబు

శ్మశానవాటికల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

చింతలపూడి : శ్మశానవాటికల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ డా కామిల్ జమ అన్నారు. చింతలపూడి మండలం, సీతానగరం గ్రామంలో ముస్లింల శ్మశాన వాటికను ఆదివారం ఆయన పరిశీలించారు. శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని స్థానిక గ్రామ ముస్లింలు వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌ను గతంలో కోరడంతో ఇటీవల శ్మశానవాటికను శుభ్రం చేసి అభివృద్ధి చేయడానికి సహకరించారు. దీంతో గ్రామ ముస్లింలు వక్ఫ్ బోర్డ్ చైర్మన్ డా.కామిల్ జమాకు కృతజ్ఞతలు తెలిపారు. చాలా కాలంగా శ్మశానవాటికను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని ప్రస్తుత ప్రభుత్వం హయాంలో అభివృద్ధి పరచడం పట్ల ముస్లిం మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.


సీతానగరంలో అభివృద్ధి చేసిన ముస్లింల శ్మశానవాటిక

క్షతగాత్రుడిని ఆదుకున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

దెందులూరు: రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని అంబులెన్స్‌ను పిలిపించి ఆస్పత్రికి తరలించి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి మానవత్వం చాటుకున్నారు. గన్నవరం కమ్యూనిస్టు పార్టీ ఆఫీసు ఎదురుగా ఒక వ్యక్తి బైక్‌పై నుంచి ఆదివారం ఏలూరు నుంచి విజయవాడ వెళుతూ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. విజయవాడ వెళుతున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి వెంటనే కాన్వాయ్‌ను ఆపి క్షతగాత్రుడిని పరామర్శించి సపర్యలు చేశారు. అంబులెన్స్‌కు సమాచారం అందించి, అది వచ్చే వరకూ అక్కడే ఉండి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

నాగరాజు ఆకస్మిక మృతి బాధాకరం

దెందులూరు: మోర్ల నాగరాజు ఆకస్మిక మృతి బాధాకరమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఆదివారం నాగులదేవునిపాడులో నాగరాజు సంతాప సభలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పాల్గొని నాగరాజు చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. నాగరాజు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు బోయపాటి గణేష్, వార్డు సభ్యులు శ్రీధర్ తదితరులు ఉన్నారు.


ప్రమాదానికి గురైన వ్యక్తిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే

బాలలకు మధుమేహ నివారణ మందుల పంపిణీ

ఉంగుటూరు: ఇటీవల చిన్నారుల్లో మధుమేహ వ్యాధి ఎక్కువగా కనిపిస్తోందని ఇది ఆందోళన కలిగిస్తోందని ఆలిండియా డయాబెటిస్ రీసెర్చ్ సొసైటీ అధ్యక్షుడు డా.పీవీ రావు అన్నారు. ఆదివారం ఉంగుటూరు దివంగత డా. పాతూరి శివన్నారాయణ కమ్మ కల్యాణ మండపంలో చిన్నారులకు ఉచిత మధుమేహ వ్యాధి శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. పీవీ రావు మాట్లాడుతూ గతంలో దేశంలో చిన్నారులలో మధుమేహ వ్యాధి ఉండేది కాదని, ఇప్పుడు మధుమేహ వ్యాధితో బాధపడే చిన్నారుల శాతం పెరిగిందని అన్నారు. తల్లితండ్రులు అప్రమత్తమై తమ పిల్లలకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కొన్ని కంపెనీలు అందిస్తున్న ప్రోత్సాహంతో హైదరాబాదు కేంద్రంగా 700 మంది పిల్లలను దత్తత తీసుకుని వారికి మధుమేహ వ్యాధి నివారణ మందులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఆదివారం ఉంగుటూరులో నిర్వహించిన వైద్యశిబిరంలో మూడు జిల్లాల నుంచి 80 మంది చిన్నారులు హాజరయ్యారు. వారికి మందులు, టెస్టింగు కిట్లు, సూది మందులు ఉచితంగా అందజేశారు. వారందరికీ ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు. డా. పీవీ రావుతోపాటు ఎన్ఆర్ఐ డా. నాగళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు. హైదరాబాదు నుంచి వచ్చిన టీం సభ్యులు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డా. పీవీ రావును, డా.శ్రీనివాసరావును గ్రామస్తులు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, పాతూరి విజయకుమార్, కార్యక్రమం నిర్వాహకుడు పాతూరి వంశీ, పిళ్ళా రామకృష్ణ, చల్లా సూర్యారావు పాల్గొన్నారు.


ఉంగుటూరులో బాలలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న 91వ శ్రీరామకోటి మహోత్సవాల ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం భారీ నారాయణ సేవ (అన్న సమారాధన) కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ చేసి, భక్తుల గోత్ర నామాలతో అష్టోత్తరపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం నిర్వహించిన నారాయణ సేవలో సుమారు 2 వేల మంది భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన ది వెంకట్రాయ నాట్య బృందం ఆధ్వర్యంలో నాట్యాచారిణి నీలి శర్వాణి శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి తొలుత అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు నిర్వహించగా శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

భీమడోలు: మానసిక ప్రశాంతత ధ్యానం వల్లే సాధ్యమని ఏలూరు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు మాజేటి శేషగిరిరావు అన్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని భవానమ్మ ఆలయంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఒక రోజు ధ్యాన శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు మాజేటి శేషగిరిరావు మాట్లాడుతూ జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మంచి ఆరోగ్యం, ఉత్తమైన జీవన విధానం ధ్యానం వల్ల సాధ్యమని అన్నారు. ఒత్తిడి లేని జీవనానికి ధ్యానం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం మాజేటి శేషగిరిరావు దంపతులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పుప్పాల శ్రీనివాసరావు, భవానమ్మ కమిటీ పెద్దలు పాశం రామాంజనేయులు, మానవత మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


పూళ్ల భవానమ్మ ఆలయంలో మాజేటి శేషగిరిరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

చికిత్స పొందుతూ యువకుడు మృతి

దెందులూరు: గ్రామానికి చెందిన మోటారు మెకానిక్ రమేష్ ఆదివారం తెల్లవారుజామున విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందాడని దెందులూరు ఎస్సై ఐ. వీర్రాజు తెలిపారు. రమేష్ (27) దెందులూరు ఎస్ఎంఆర్ నగర్‌లో మెకానిక్ షెడ్డు నిర్వహిస్తున్నాడన్నారు. రెండు రోజుల క్రితం రమేష్ పురుగు మందు తాగడంతో కుటుంబ సభ్యులు, బంధువులు విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం రమేష్ మృతి చెందాడని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు వెంకటకృష్ణాపురంలో మెగా వైద్యశిబిరం

ఉంగుటూరు: మానవత సంస్థ ఆధ్వర్యంలో కైకరం శివారు వెంకటకృష్ణాపురంలో సోమవారం మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి వెల్లడించారు. ఆదివారం నెలవారీ కైకరంలో మండల మానవత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గోపి మాట్లాడుతూ ఆశ్రం ఆసుపత్రికి చెందిన 20 మంది వైద్య నిపుణులు శిబిరంలో వైద్యసేవలు అందజేస్తారన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం, పరిసర ప్రాంతాల ప్రజలు ప్రయాణ సంబంధ సమస్యలు, సలహాలు 99592 25489 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎబినేజర్‌కు సత్కారం


ఆంధ్ర సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారిచే సత్కారం అందుకున్న ఎబినేజర్, మరియా దంపతులు

కొయ్యలగూడెం : సామాజిక సేవా కార్యక్రమాలలో విశేష కృషి చేసినందుకుగాను ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ దిద్దే ఎబినేజర్ ఏపీజే అబ్దుల్ కలాం సేవారత్న పురస్కారం అందుకున్నారు. తణుకుకి చెందిన స్వచ్ఛంద సంస్థ ఆంధ్ర సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఈ పురస్కారం అందజేసింది. ఈ సందర్భంగా ఎబినేజర్, మరియ దంపతులను ఘనంగా సత్కరించారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ రొక్కాల నాగబుజ్జి మాట్లాడుతూ 2020–21 సంవత్సరాల కోవిడ్ లాక్ డౌన్ సమయంలో ఎబినైజర్ దంపతులు ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా వెనుకబడిన ప్రాంతాలలో సేవలందించారన్నారు. కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పాతికేళ్లు పనిచేసిన ఆయన తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా చేసి పదవీ విరమణ పొందారు.

వ్యక్తిపై కేసు నమోదు

ద్వారకాతిరుమల : ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి రోడ్డు ప్రమాదానికి కారకుడైన వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం ఏలూరుకు చెందిన రెడ్డి శశిసాయిబాబు ఈనెల 23వ తేదీ రాత్రి ద్వారకాతిరుమల కొండపైన జరిగిన ఒక వివాహ వేదికకు వారి బంధువులతో కలిసి హాజరయ్యాడు. ఇదిలా ఉంటే మరోసటి రోజు 24న అర్ధ రాత్రి 12:30 గంటల సమయంలో కొండపై నుంచి కిందికి దిగుతున్న సమయంలో స్థానిక టోల్‌గేట్ వద్ద ఒక ద్విచక్ర వాహనదారుడు బైక్‌ను అతివేగంగా నిర్లక్ష్యంగా నడుపుతూ శశిసాయిబాబు బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అతడిని బంధవులు హుటాహుటినా ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల : జి.కొత్తపల్లిలో ఒక పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై సుధీర్ తెలిపారు. ఈ దాడిలో ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ: 1700, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కోడి పందేల స్థావరంపై దాడి

మెట్టపంగిడిగూడెంలో ఆదివారం సాయంత్రం కోడి పందేల స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఒక కోడి పుంజు, రూ: 2,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

జయలక్ష్మి మృతి విచారకరం


కె.విశ్వనాథ్, ఆయన సతీమణి జయలక్ష్మితో స్త్రీ వేషధారణలో కేవీ సత్యనారాయణ (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దివంగత దర్శక దిగ్గజం కె.విశ్వనాథ్ సతీమణి జయలక్ష్మి మృతి విచారకరమని నగరానికి చెందిన సినీ నృత్య దర్శకుడు కేవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తనకు సినిమాల్లో నృత్య దర్శకునిగా అవకాశం కల్పించి తన ఎదుగుదలకు కారణమైన కె.విశ్వనాథ్ ఈనెల 3న మరణించడాన్ని జీర్ణించుకోలేకపోతున్న తరుణంలో తనకు మాతృ సమానురాలైన ఆయన సతీమణి జయలక్ష్మి మరణ వార్త కూడా ఈ నెలలోనే వినాల్సి రావడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఆ దంపతులిరువురూ ఏలూరు వచ్చినప్పుడు తన నివాసంలోనే బస చేసి కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారని తెలిపారు. వారి మృతిపై సంతాపం తెలిపారు.